సాక్షి ఒడిశా

శుక్రవారం । 5 । జూలై । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.58,302లు, వచ్చాయని అధికారులు తెలిపారు.



ప్రకృతి విపత్తుల్లో ప్రాణనష్ట నివారణే లక్ష్యం

ప్రకృతి వైపరీత్యాల్లో ప్రాణనష్ట నివారణే లక్ష్యమని, ఈ మేరకు అన్ని చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అన్నారు.

- 8లో



మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని వక్తలు పేర్కొన్నారు.

- 8లో

న్యూస్‌రీల్

విషపూరిత పాము కలకలం



పామును పట్టుకున్న స్నేక్ క్యాచర్ ప్రదీప్

రాయగడ: స్థానిక గాంధీనగర్‌లోని గౌరి అనే పాల వ్యాపారి ఇంట్లో విషపూరిత సర్పం కలకలం సృష్టించింది. ఇంటి యజమానురాలు గురువారం ఉదయం పూజ గదిలోకి వెళ్లి పూజ చేసేందుకు సిద్ధమవుతున్న సమయంలో పక్కనే పాము కనిపించింది. దీంతో ఒక్కసారిగా కంగారుపడుతూ ఇంటి యజమానికి సమాచారం అందించింది. దీంతో స్నేక్ క్యాచర్ ప్రదీప్ కుమార్ సేనాపతి సంఘటన స్థలానికి చేరుకుని సుమారు గంట సమయం శ్రమించి పామును పట్టుకోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం పామును సమీపంలోని అడవిలో విడిచిపెట్టారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి



జితేంద్ర మృతదేహం

జయపురం: సబ్ డివిజన్‌లోని బొయిపరిగుడ పోలీసుస్టేషన్ పరిధి చంద్రపాడ గ్రామంలో ఒక యువకుడు గురువారం విద్యుత్ షాక్‌తో దుర్మరణం చెందాడు. మరణించిన యువకుడు జయపురం కొత్తవీధి 1వ లైన్‌కు చెందిన బినోద్ సామంతరాయ్ కుమారుడు జితేంద్ర సామంతరాయ్(23)గా గుర్తించారు. జితేంద్ర రోజుకూలీ పనులు చేసుకుంటున్నాడు. ఇటీవల 8 రోజుల క్రితమే కోట్‌పాడ్ సమితి ఘుమర గ్రామంలోని సొనాలి నాగ్‌ను వివాహ మాడాడు. ప్రతిరోజు మాదిరిగానే పని కోసం బొయిపరిగుడలోని ఒక భవనంలో మార్బుల్ ప్లేట్ వేసేందుకు వెళ్లాడు. ఆ భవనంలో ఉన్నటువంటి ఇనుప రాడ్లు బయటకు తీసే క్రమంలో విద్యుత్ వైర్‌కు తగలడంతో షాక్‌తో పడిపోయాడు. వెంటనే అక్కడ ఉన్నవారు అతడిని బొయిపరిగుడ కమ్యూనిటీ ఆస్పత్రికి తీసుకెళ్లగా అతడిని పరిశీలించిన డాక్టర్లు జితేంద్ర అప్పటికే మరణించినట్లు నిర్ధారించారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.


బాలిక ఆత్మహత్యకు కారణమైన యువకుడి అరెస్టు



అరెస్టైన బికశ కులదీప్

జయపురం: ఒక మైనర్ బాలిక ఆత్మహత్యకు కారకుడన్న ఆరోపణపై ఒక యువకుడిని అరెస్టు చేసినట్లు జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర చంద్ర తండి గురువారం వెల్లడించారు. నిందితుడు బొరిగుమ్మ సమితి కేవిడి గ్రామానికి చెందిన బికాశ కులదీప్‌గా పేర్కొన్నారు. వివరాల్లోకి వెళ్తే.. మైనర్ బాలికకు, బికాశ్‌ల మధ్య ఏదో కారణంతో గొడవ జరిగింది. అయితే ఆ సమయంలో బికాశ ఆ బాలికను ఆత్మహత్య చేసుకోమని ప్రేరేపించాడని కాల్ రికార్డింగ్‌తో ఆమె కుటుంబ సభ్యులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు.

రక్తహీనతపై అవగాహన



విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని మహిళా మహా విద్యాలయంలో సికిల్ సెల్ (రక్త హీనత) వ్యాధిపై అవగాహన కార్యక్రమం బుధవారం జరిగింది. విద్యార్థినులకు ఈ వ్యాధి లక్షణాలు గుర్తించడం తదితర అంశాలపై నబరంగ్‌పూర్ జిల్లా కేంద్ర ఆస్పత్రి స్పెషలిస్ట్ నబకిషోర్ బెహరా వివరించారు. శరీరంలో రక్త కణాలు తగ్గిపోవడం వలన రోగి బలహీనపడతాడన్నారు. ప్రస్తుతం ఈ వ్యాధి చిన్నారుల్లో అధికంగా కనిపిస్తోందని పేర్కొన్నారు. సికిల్ సెల్‌కు ప్రస్తుతం వైద్య పరిజ్ఞానంలో అధునాతన చికిత్సా విధానాలు ఉన్నాయని తెలియజేశారు. అనంతరం రక్త హీనతపై విద్యార్థినులకు ఓపెన్ క్విజ్ నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో తుషార్ కుమార్ సాహు, అధ్యాపకురాలు సంజుక్తా పండా తదితరులు పాల్గొన్నారు.

విశ్వ వేడుకకు సన్నద్ధం

- రథయాత్రకు సిద్ధమవుతున్న బొడొదండొ
- రంగవల్లులతో ముస్తాబైన వాకిలి
- భక్తులను ఆకట్టుకుంటున్న రథాలు

భువనేశ్వర్:


జగన్నాథ స్వామివారి రథయాత్ర దగ్గర పడుతుండడంతో శ్రీమందిరం వాకిలి బొడొదండొ కళకళలాడుతోంది. మరోవైపు స్వామి ఆరోగ్యం కోలుకున్న వార్త దైతపతి సేవాయత్ వర్గాలు ప్రకటించడంతో భక్తుల్లో ఉత్సాహం రెట్టింపు అయ్యింది. రేపో మాపో స్వామివారు తమ మధ్యకు రానున్నాడని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే 3 రథాల పనులు చకచకా సాగుతున్నాయి. దాదాపు వడ్రంగి, కమ్మరి వర్గాల పనులు తుది దశకు చేరుకుని మెరుగులు దిద్దుకుని సిద్ధమవుతున్నాయి. రూపకారులు, చిత్రకారులు, దర్జీ సేవలకు రథాల వెలుపలి హంగుల ముస్తాబు కార్యకలాపాల్లో తలమునకలై పని చేస్తున్నారు. తయారైన 3 రథాలు శ్రీ మందిరానికి ఆసన్నంగా నిలబడి ఉండడంతో రథాల పైభాగం శ్రీ మందిరం గోపురాన్ని పోలి భక్తజన హృదయాలను పులకింపజేస్తోంది. శ్రీ మందిరంలో మూల విరాటుల దర్శనం లేకున్నా బొడొదండొలో నిలిచిన రథాల శోభని ప్రత్యక్షంగా తిలకించేందుకు దూర ప్రాంతాల యాత్రికులు తరలి వస్తున్నారు. రాత్రింబవళ్లు రథాల శోభ యాత్రికులు, సందర్శకుల్ని విశేషంగా ఆకట్టుకుంటుంది.



శోభాయమానంగా రూపుదిద్దుకున్న బొడొదండొ

భారీ రంగవల్లుల అలంకరణ

పక్షం రోజుల తర్వాత సాక్షాత్తు జగతినాథుడు భక్తజనంలోకి అడుగిడేందుకు సిద్ధం అవుతున్నాడు. స్వామిని మనసారా ఆహ్వానించేందుకు శ్రీ మందిరం సింహద్వారం వాకిలి బహు వర్ణాల భారీ రంగవల్లులు రూపుదిద్దుకుంటున్నాయి. ఈ ప్రాంగణంలో స్వామి యాత్ర కోసం రథాలు చేరనున్నాయి. అంతకు ముందే వాకిలి రంగుల కళతో తళుక్కమని పోతోంది.



శ్రీమందిరం వద్ద నిలిచిన నింగిని తాకే రథాలు (ఇన్‌సెట్లో) సరాసరి శ్రీమందిరం గోపురాన్ని పోలిన రథ శిఖర భాగం



● నటవర శోభలో అలార్‌నాథ్



భారీ స్నానం ఆచరించిన స్వామి అస్వస్థతతో చికిత్స కోసం కనుమరుగు కావడంతో సమీప దూరంలో ఉన్న బ్రహ్మగిరి ప్రాంతంలో అలార్ నాథ్ దేవస్థానం పండగ శోభని సంతరించుకుంది. అలార్ నాథుని దర్శనం శ్రీ జగన్నాథుని దర్శనం సమాన ఫలాన్ని ప్రసాదిస్తుందని అనవసర వ్యవధిలో భక్తులు ఈ క్షేత్రానికి తండోప తండాలుగా తరలి వస్తున్నారు. నిత్య శోభాయమానుడిగా అలార్ నాథ స్వామి భక్తులను తన్మయపరుస్తున్నారు. గురువారం నటవర అలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ క్షేత్రంలో పాయసం (క్షీరి) స్వామికి అత్యంత ప్రీతిపాత్రమైన నైవేద్యం. అత్యంత రుచికరంగా ఉండే ఈ ప్రసాదం భక్తులు, యాత్రికులను ఆకట్టుకుంటుంది.

● అనంత నారాయణుని దర్శనం



శ్రీ క్షేత్రం సందర్శిస్తున్న యాత్రికులకు పతిత పావనుని స్థానంలో అనంత నారాయణుని దర్శనం ప్రాప్తిస్తోంది. శ్రీ మందిరం సింహ ద్వారం ఆవరణలో పతిత పావనుడు కుడ్య ప్రతిమగా నిత్యం దర్శనం ఇస్తాడు. సింహద్వారం ఆవరణలో అల్లంత దూరం నుంచి స్వామి దర్శనం కనులారా నిత్యం లభిస్తోంది. కుల, మత, వర్గ, వర్ణ ఇతరేతర తారతమ్యాలకు అతీతంగా లభించే ఈ దర్శనం పతితుల్ని పావనం చేస్తుందని తరతరాలుగా భక్తజన పోకడలో నిలకడగా కొనసాగుతున్న అపార విశ్వాసం. అనవసర వ్యవధిలో మూల విరాటుల తరహాలో పతిత పావనుని వాస్తవ మూర్తి దర్శనం లభించదు. ప్రత్యామ్నాయంగా దీని స్థానంలో తడకకు అమర్చిన పట్టా చిత్రపటంలో అనంత నారాయణుడి దర్శనం లభిస్తుంది. పతిత పావనునికి నిర్వహించే నిత్య పూజార్చనలు తరహాలో అనంత నారాయణునికి నిర్వహించడం విశేషం.



అలార్‌నాథుని పాయస ప్రసాదం

ఆక్రమణలు కూల్చివేత



పర్యవేక్షిస్తున్న అధికారులు



పర్లాకిమిడి రాజవీధిలో ఆక్రమణలు కూల్చివేస్తున్న మున్సిపల్ శాఖ

పర్లాకిమిడి: స్థానిక రాజవీధిలో రథయాత్ర సందర్భంగా ఆక్రమణలను మున్సిపల్ అధికారులు జేసీబీలతో గురువారం ఉదయం కూల్చివేశారు. మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ అధికారి ఎగ్జిక్యూటివ్ మాజిస్ట్రేట్‌గా వ్యవహరించగా, సబ్ కలెక్టర్ అలోక్ పండా, తహసీల్దార్ నారాయణ బెహరా, ఆదర్శ పోలీసుస్టేషన్ అధికారి ప్రశాంత్ భూపతి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. శ్రీజగన్నాథ మందిరం నుంచి గుండిచా మందిరం బొడోదొండో వరకూ మున్సిపల్ నాలాపై ఉన్న ఆక్రమణలు, దుకాణాలు తొలగించారు. అయితే ఎటువంటి ముందస్తు నోటీసులు లేకుండా ఆక్రమణలు కూలచ్చడంపై వ్యాపారవర్గాలు విమర్శిస్తున్నారు. ఇదిలా ఉండగా పబ్లిక్‌లో మైక్ అనౌన్స్‌మెంట్ ద్వారా మూడు రోజులుగా చెబుతున్నా రాజవీధిలో వ్యాపారులు స్పందించలేదని అధికారులు పేర్కొన్నారు

విద్యార్థులకు క్రీడా శిక్షణ శిబిరం

జయపురం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్రీడా శిక్షణ శిబిరం గురువారం ప్రారంభించారు. హెచ్‌ఎం ప్రకాశ్ చంద్ర పట్నాయిక్, బ్లాక్ విద్యాధికారి చందన కుమార్ నాయిక్‌లు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. రాష్ట్ర సాధన అధికారి సుభేందు కుమార్ ప్రధాన్, జయపురం బ్లాక్ ప్రధాన క్రీడా శిక్షకుడు గగన బిహారి దాస్, క్రీడా శిక్షకులు తపన మహంతి తదితరులు విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం ప్రకాశ్ చంద్ర పట్నాయిక్ మాట్లాడుతూ ఇంతవరకు మూడు రకాల శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. సాహిత్య సృజనీ, జిజ్ఞాస, కౌశలీ బ్లాక్‌ల నిర్వహణపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్లు వివరించారు. కార్యక్రమంలో కొరాపుట్ జిల్లా విద్యాధికారి డాక్టర్ ప్రశాంత కుమార్ మహంతి, జిల్లా కమ్యూనిటీ కార్యదర్శి చంద్రకళ బెహర్త, జయపురం బ్లాక్ ఎడ్యుకేషనల్ విభాగ అధికారి చందన కుమార్ నాయిక్ పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

రాయగడ: కారులో అక్రమంగా గంజాయిని తరలిస్తుండగా జిల్లాలోని పద్మపూర్ పోలీసులు పట్టుకున్నారు. అతని నుంచి 107.500 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితుడిని గురువారం కోర్టుకు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. పద్మపూర్ పోలీసులు బుధవారం ఉదయం గంజాయి అక్రమ రవాణా జరుగుతుందని అందిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో మిరిండ నుంచి తాడికొన వైపు ఒక కారు వెళ్తుండడం గమనించి, ఆ కారుని ఆపి తనిఖీ చేయగా అందులో నాలుగు సంచుల్లో గంజాయి పట్టుబడింది. దీనికి సంబంధించి కారు డ్రైవర్ శరత్ జగరంగను అరెస్టు చేశారు. అరెస్టైన నిందితుడు పద్మపూర్ సమితి మిరండ గ్రామానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు.

రథయాత్ర ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ కీర్తి వాసన్, ఎస్పీ అభినవ్‌లు

కొరాపుట్: దక్షిణ ఒడిశాలో రెండో పూరీగా కొలువబడుతున్న కొరాపుట్ శబరి శ్రీక్షేత్రంలో రథయాత్ర ఏర్పాట్లను కలెక్టర్ వీ.కీర్తి వాసన్ బుధవారం పరిశీలించారు. జగన్నాథ మందిరం, గుండిచా మందిరం, మూడు రథాలు నిలిపి ఉంచే ప్రాంతం, రథాలు వెళ్లే మార్గాలు నడచి వెళ్లి పరిశీలించారు. మార్గంలో అవసరమైన ఏర్పాట్లుపై అధికారులకు సూచనలు చేశారు. మెడికల్ జంక్షన్, రాణిగడ మార్గం, రాయగడ మార్గాల్లో వాహనాల మళ్లింపుపై ప్రణాళికలు అమలు చేయనున్నారు. వాహనదారులు ఇబ్బందులు పడకుండా ఉండడానికి పలుచోట్లు రహదారి మళ్లింపు బ్యానర్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. మురుగు నీటి కాలువల మీద సిమ్మెంట్ పలకలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎస్పీ అభినవ శంకర్ మాట్లాడుతూ ఈ విడత ఏడు ప్లాటూన్ల పోలీసులను రథయాత్రలో వినియోగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో రథయాత్ర కమిటీ సభ్యులు, దేవదాయ, విద్యుత్, పోలీస్, రెవెన్యూ, వైద్యశాఖ, పురపాలక శాఖల అధికారులు పాల్గొన్నారు.

నీలకంఠేశ్వర ఆలయ పునరుద్ధరణకు సన్నాహాలు



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

జయపురం: జయపురం సబ్ డివిజన్ బొరిగుమ్మలోని అతి పురాతన నీలకంఠేశ్వర మందిరాన్ని పునరుద్ధరించాలని బొరిగుమ్మ పెద్దలు నిర్ణయించారు. ఈ మేరకు నీలకంఠ మందిర ప్రాంగణంలో తహసీల్దార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో మందిర పునరుద్ధరణ కమిటీని నియమించారు. కమిటీ అధ్యక్షుడిగా తహసీల్దార్, ఉపాధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ పట్నాయక్, కార్యదర్శిగా బాల దొర, సహాయ కార్యదర్శులుగా శివ ప్రసాద్ మహంతి, సురేష్ రౌత్‌లు, కోశాధికారిగా సూర్యనారాయణ ఆచారిలను నియమించారు. మందిరం పనులు త్వరలోనే చేపట్టాలని అందుకు ప్రజల సహకారం తీసుకోవాలని పేర్కొన్నారు.

పర్వత ప్రాంతాల్లో విద్యుత్ సౌకర్యం కల్పిస్తాం



విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న దృశ్యం

● కలెక్టర్ మనోజ్ మహాజన్

రాయగడ: కల్యాణ సింగుపూర్ సమితిలోని నియమగిరి పర్వత ప్రాంతాల్లో త్వరలో విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ అన్నారు. నియమగిరి పర్వత ప్రాంతాల్లోని పర్శాలి పంచాయతీ పరిధి లంబ, డొంగమాటి గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. ఆయా ప్రాంతాల ప్రజల కష్టాలను తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. గ్రామాల్లో ఇంటింటా ఆయన ప్రత్యేకంగా తిరిగి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో గ్రామస్తులు తమ గ్రామాల్లో విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రస్తుతం ఈ గ్రామాల్లో సోలార్ విద్యుత్ సౌకర్యం ఉన్నప్పటికీ, తరచూ లైట్లు వెలగకపోవడంతో గ్రామాలు అంధకారంలో ఉంటున్నాయని విన్నవించుకున్నారు. ఈ నేపథ్యంలో స్పందించిన కలెక్టర్ త్వరలో ఈ గ్రామాల్లో విద్యుత్ వెలుగులు వెదజిమ్మేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రధానమంత్రి జన్‌మన్ పథకంలో అంతర్భాగమైన లబ్ధిదారులతో కాసేపు మాట్లాడి పథకాలు సక్రమంగా అందకపోతే తక్షణమే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఏ సమస్య అయినా అధికారుల దృష్టికి తీసుకెళ్తే పరిష్కారమవుతుందని అభిప్రాయపడ్డారు. ఆయనతో పాటు ఎస్పీ హరీష్ బిసి, కల్యాణ సింగుపూర్ సమితి బీడీవో మనీషా దాస్ తదితరులు ఉన్నారు.



లంబ గ్రామస్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ మహాజన్, ఎస్పీ హరీష్‌లు

విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ

లంబ, డొంగమటి గ్రామాల్లో పర్యటించిన కలెక్టర్ మనోజ్‌ఆయా గ్రామాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. అదేవిధంగా వృద్ధులకు గొడుగులు, తదితర వస్తువులను అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి దుర్మరణం

రాయగడ:

జిల్లాలోని చందిలి పోలీసుస్టేషన్ పరిధి బీసీ రోడ్డు వద్ద గురువారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో ఒక బాలుడు దుర్మరణం పాలయ్యాడు. గుర్తు తెలియని లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు, స్థానికులు తెలియజేసిన వివరాల ప్రకారం.. జిల్లాలోని గుడారి పోలీసుస్టేషన్ పరిధి బెలాంగుడ గ్రామానికి చెందిన బెయిద్య కౌసల్య, అతని కొడుకు సహిల్ కౌసల్య(14) లు సొంత పనిమీద ఒక బైకులో రాయగడకు వచ్చారు. పనులు ముగించుకుని తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో జేకేపూర్ సమీపంలోని బీసీ రోడ్డు వద్ద ఒక గుర్తు తెలియని లారీ వెనుక నుంచి బైకును ఢీకొనడంతో బైకుపై కూర్చున్న సహిల్ అక్కడికక్కడే మృతి చెందాడు. స్వల్ప గాయాలతో బెయిద్య బయటపడ్డాడు. బైకును ఢీకొన్న లారీ ఆగకుండా వెళ్లిపోగా సుమారు 7 కిలోమీటర్ల దూరంలోని భుజబల్ వద్ద కొందరు గ్రామస్తులు లారీని అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.



సంఘటన స్థలంలో కొడుకు మృతదేహం వద్ద రోదిస్తున్న తండ్రి



ప్రమాదానికి కారణమైన లారీ

ప్రకృతి విపత్తుల్లో ప్రాణనష్ట నివారణే లక్ష్యం

- తుఫాన్‌లను ఎదుర్కొనేందుకు సన్నద్ధత అవసరం
- సతర్క్ యాప్‌తో ప్రజలకు ముందస్తు సమాచారం
- సీఎం మోహన్ చరణ్ మాఝి


సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: ప్రకృతి వైపరీత్యాల్లో ప్రాణనష్ట నివారణే లక్ష్యమని, ఈ మేరకు అన్ని చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అన్నారు. స్థానిక లోక్‌సేవా భవన్‌లో గురువారం ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన మొదటి రాష్ట్ర ప్రకృతి విపత్తు కమిటీ సమావేశం-2024లో ఈ విషయం ప్రకటించారు. వరదలు మరియు తుఫాన్లను ఎదుర్కొనేందుకు విపత్తు సన్నద్ధతను సరిగ్గా సమీక్షించాల్సిన అవసరం ఉంది. క్షేత్రస్థాయిలో పరిస్థితులపై యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. ముందస్తు హెచ్చరికలు, సహాయక చర్యలు, సురక్షిత తాగునీటి సరఫరా, ఆరోగ్యం, పశువైద్యం, చికిత్స వంటి రంగాల్లో తగిన చర్యలు తీసుకోవాలి. సత్వర చర్య కోసం ఓడ్రాఫ్ మరియు అగ్నిమాపక దళం అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉప ముఖ్యమంత్రులు కనకవర్ధన్ సింగ్ దేవ్, ప్రభాతి పరిడా, రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి సురేష్ కుమార్ పూజారి, ఆరోగ్య శాఖ మంత్రి ముఖేష్ మహాలింగ్, న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్, ఇతర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. వీరితో పాటు ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా, అభివృద్ధి కమిషనర్ అనుగర్గ్, ముఖ్యమంత్రి అదనపు ప్రధాన కార్యదర్శి నికుంజ్ బిహారీ ధొలొ, రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ అదనపు ముఖ్య కార్యదర్శి సత్యబ్రత్ సాహు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పూడికలు తొలగించాలి

పట్టణ ప్రాంతాల్లోని మురుగు కాలువల్లో పూడికలు తొలగించి వర్షపు నీటి ప్రవాహానికి అంతరాయం నివారించాలని పట్టణాభివృద్ధి శాఖను ముఖ్యమంత్రి ఆదేశించారు. పట్టణ వరద నిర్వహణ కోసం రూ.200 కోట్ల ముసాయిదా ప్రతిపాదనను సిద్ధం చేయాలని భువనేశ్వర్ నగర పాలక సంస్థ (బీఎంసీ)ని ఆదేశించారు. ఐఐటీ ఢిల్లీ సాంకేతిక సహకారంతో కటక్, భువనేశ్వర్ మరియు ఇతర పట్టణ ప్రాంతాల్లో వరద నిర్వహణ కోసం దీర్ఘకాలిక కార్యక్రమాన్ని సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రం, జిల్లా మరియు ఇతర కార్యాలయాల్లో రాత్రింబవళ్లు కంట్రోల్ రూమ్ పనిచేస్తుందన్నారు. వర్షాకాలంలో పాముకాటు ప్రమాదాలు ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున అన్ని ఆరోగ్య కేంద్రాల్లో యాంటీ వెనమ్ ఇంజెక్షన్లు నిల్వ ఉంచాలని ఆరోగ్య శాఖను ఆదేశించారు. మొబైల్ యాప్ సతర్క్ ద్వారా వివిధ విపత్తుల గురించి ప్రజలకు ముందస్తు సమాచారం చేరవేసేందుకు చర్యలు తీసుకుంటామని, యాప్‌పై అవగాహన కల్పిస్తామన్నారు. ఓడ్రాఫ్ దేశంలోనే తొలి రాష్ట్ర స్థాయి విపత్తు స్పందన దళం అని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. రాష్ట్రంలో మరియు వెలుపల వివిధ విపత్తుల సమయంలో ఓడ్రాఫ్ అద్భుతమైన సహాయక చర్యలతో ఒడిశాకు కీర్తిని తెచ్చిపెట్టిందని అభినందించారు.

ఓడ్రాఫ్ సేవల విస్తరణ

ఓడ్రాఫ్ సేవలు మరింత విస్తృతపరచనున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. త్వరలో 30 యూనిట్లకు పెంచి ప్రత్యేక దళాన్ని తయారు చేసేందుకు హోంశాఖ చర్యలు తీసుకుంటుందన్నారు. రాష్ట్ర విపత్తు సహాయ నిధి (ఎస్‌డీఆర్‌ఎఫ్) నుంచి రూ.394 కోట్ల వ్యయ ప్రణాళికతో అగ్నిమాపక శాఖ సామర్థ్యాన్ని పెంచుతారు. ఈ శాఖను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం రూ. 200 కోట్లకు పైగా అదనపు నిధులు కేటాయిస్తుందని తెలిపారు. బహనాగా రైలు దుర్ఘటన వంటి పలు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని ఐదు ప్రాంతీయ ఫైర్ సర్వీస్ హబ్‌లను వెంటనే పని చేసేలా చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ఈ ఏడాది వరదలు వచ్చే అవకాశం ఉన్న దృష్ట్యా, విపత్తు వల్ల కలిగే నష్టాన్ని తగ్గించేందుకు ప్రత్యేక సహాయ కమిషనర్ అన్ని శాఖలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. మన రాష్ట్రం ప్రకృతి వైపరీత్యాలకు గురయ్యే రాష్ట్రమని విచారం వ్యక్తం చేశారు. ఝార్సుగుడలో పడవ బోల్తా, పూరీలో బాణాసంచా పేలుడు, పశ్చిమ ఒడిశాలో వడదెబ్బ మృతులపై ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. బహనాగా రైల్వే ప్రమాదంలో సత్వర సహాయక చర్యల్లో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తీసుకున్న చర్యలను సీఎం కొనియాడారు.

విపత్కర పరిస్థితుల్లో అందుబాటులో లేని ప్రదేశాల్లో తగిన ఆహారం మరియు పశుగ్రాసం నిల్వ, తగినంత పాడి ఆహారాలు మరియు ఇతర అవసరమైన వస్తువులను అన్ని ఆశ్రయ కేంద్రాల్లో తప్పనిసరిగా నిల్వ చేయాన్నారు. గర్భిణులు, పిల్లలు మరియు అనారోగ్యం, వయో వృద్ధులపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని అనుబంధ వర్గాలకు సూచించారు. నష్టం అంచనా అనంతరం తక్షణ సాయం అందజేయడం జరగాలని ఆదేశించారు.

సీఎంవోలో ప్రత్యేక పూజలు

- మొదటిసారి కార్యాలయంలోకి సీఎం మోహన్ చరణ్ మాఝి


లోక్ సేవా భవన్ ఆవరణలో మోకరిల్లి నమస్కరిస్తున్న సీఎం మోహన్ చరణ్


తన చాంబర్‌లో సీఎం మోహన్‌చరణ్

భువనేశ్వర్: రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అధికారిక కార్యాలయంలో గురువారం నుంచి ప్రభుత్వ కార్యకలాపాలు ప్రారంభించారు. స్థానిక లోక్‌సేవా భవనం మూడో అంతస్తులో ఉన్న ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో)లో గురువారం తొలిసారిగా అడుగిడారు. లోక్‌సేవా భవన్ ఆవరణలో మోకరిల్లి నమస్కరించి లోనికి ప్రవేశించారు. ఈ సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం లభించింది. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ముఖ్యమంత్రి తన అధికారిక కార్యాలయం గదిలోకి ప్రవేశించారు. ఉప ముఖ్యమంత్రులు కనకవర్ధన్ సింగ్ దేవ్, ప్రభాతి పరిడా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ ఆహూజా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో తొలిసారిగా బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో సచివాలయంలోని మూడో అంతస్తు పూర్తిస్థాయిలో పునర్నిర్మించారు. ప్రమాణ స్వీకారం ముగియడంతో ముఖ్యమంత్రి కార్యకలాపాలను ప్రారంభించారు. తన అధికారిక కార్యాలయం పునర్నిర్మాణ పనులు జరుగుతుండడంతో స్థానిక రాష్ట్ర అతిథి గృహం మొదటి అంతస్తులో అధికారిక కార్యకలాపాలు ఇప్పటివరకు నిరవధికంగా చేపట్టారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన తొలి మంత్రి మండలి సమావేశం లోక్‌సేవా భవన్‌లో జరిగినా మూడో అంతస్తులో ముఖ్యమంత్రి కోసం కేటాయించిన ఛాంబర్‌ను సందర్శించలేదు.

జితేంద్రకు వరల్డ్ ఛారిటబుల్ ఫౌండేషన్ అవార్డు


అవార్డు అందుకుంటున్న జితేంద్ర బెహారా

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహనా బ్లాక్‌కు చెందిన సమాజ సేవకుడు జితేంద్ర కుమార్ బెహారాకు నూఢిల్లీకి చెందిన వరల్డ్ ఛారిటబుల్ ఫౌండేషన్ కటక్‌లోని శతాబ్ది భవనంలో ఒడిశా సర్వోత్తమ సామాజిక సేవకుడు అవార్డును ఎమ్మెల్యే (కటక్) ప్రసాద్ చంద్ర శెఠి చేతుల మీదుగా గురువారం అందజేసింది. జితేంద్ర కుమార్ ఇదివరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రకృతి మిత్ర అవార్డు అందుకున్నారు. గత 20 ఏళ్లుగా మహారాజా కృష్ణచంద్ర యువక సంఘం, మోహనా వన సురక్షా సమితి కార్యదర్శిగా, మోహనా పోలీసు స్టేషన్ వద్ద ఎఫ్ఐఆర్ రాయడంలో అనేక మందికి సహాయపడుతున్నారు. ఆయన వరల్డ్ ఛారిటబుల్ ఫౌండేషన్ అవార్డుకు ఎంపిక కావడంపై మోహనా ఎమ్మెల్యే దాశరథి గొమాంగో, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

8న రత్న భాండాగారం తెరిచే అవకాశం లేదు

- ప్రభుత్వం నిర్ణయం మేరకే తెరవడం
- జస్టిస్ అరిజిత్ పసాయత్

భువనేశ్వర్: రథయాత్ర కారణంగా జులై 8న శ్రీజగన్నాథ ఆలయ రత్న భాండాగారం తెరిచే అవకాశం తక్కువని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అరిజిత్ పసాయత్ గురువారం భువనేశ్వర్ వచ్చిన తర్వాత తెలిపారు. రత్న భాండాగారం జాబితాను పర్యవేక్షించేందుకు ఒడిశా హైకోర్టు ఆదేశాల మేరకు గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన 12 మంది సభ్యుల కమిటీకి ఆయన నేతృత్వం వహిస్తున్నారు. ఆయన అధ్యక్షతన శుక్రవారం కీలక సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో శ్రీజగన్నాథుని రత్న భాండాగారంలోని నగలు, ఇతర విలువైన వస్తువుల జాబితా కోసం విధివిధానాలు రూపొందించబడతాయి. ప్రభుత్వం ఎప్పుడైతే రత్న భాండాగారం తెరవాలని నిర్ణయించుకుంటే అప్పుడు ప్రక్రియ ప్రారంభమవుతుంది. ప్రభుత్వం ఎప్పుడు నిర్ణయం తీసుకుంటే అప్పుడు తెరుస్తామని స్పష్టం చేయడం గమనార్హం.

త్వరలో నిర్ణయం తీసుకుంటాం

రత్న భాండాగారం తెరవడంపై రాష్ట్ర ప్రభుత్వం త్వరలో అధికారికంగా ప్రకటించనుందని రాష్ట్ర న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ బుధవారం తెలిపారు. రత్న భాండాగారం తెరిచే ప్రక్రియ, జాబితా పద్ధతులు మరియు వ్యవధిని రాష్ట్ర ప్రభుత్వం అధికారిక ఉత్తర్వుల ద్వారా రాష్ట్ర ప్రజలకు తెలియజేస్తుందన్నారు. అప్పటివరకు సోషల్ మీడియాలో వస్తున్న వదంతులను నమ్మవద్దని అభ్యర్థించారు. ఈనెల 4న రత్న భాండాగారంలో స్వామి సొత్తు గణాంకం, జాబితా సిద్ధం పని కోసం జస్టిస్ అరిజిత్ పసాయత్ ఒడిషా పర్యటనకు విచ్చేస్తున్నట్లు పొక్కడంతో ఊహాగానాలు ఊపందుకున్నాయి. అతని పర్యటన కార్యక్రమంలో జూలై 5న పూరీలో రత్న భాండాగారంలో సొత్తు జాబితా రూపకల్పన పురస్కరించుకుని లెక్కింపు ప్రక్రియ కోసం కమిటీ సమావేశం కానుంది, అనంతరం ఈనెల 7న రథయాత్ర ఉత్సవాల్లో కూడా పాల్గొంటారు. జూలై 8 మరియు జూలై 27 మధ్య రత్న భాండాగారం పనిలో పాల్గొంటారనే సమాచారం విస్తారంగా ప్రసారమైంది. అయితే జస్టిస్ అరిజిత్ పసాయత్ తాజా ప్రకటన ప్రకారం శ్రీజగన్నాథుని రత్న భాండాగారం తెరిచి సొత్తు వివరాల పరిశీలన కోసం ప్రభుత్వం సిద్ధం కానట్లు స్పష్టమవుతోంది. మరోవైపు రత్న భాండాగారం సొత్తు లెక్కింపు కమిటీ ఈ బృహత్కార్యం తక్షణమే ప్రారంభించేందుకు సన్నద్ధత పరోక్షంగా తెలియజేసింది. ఇంతలో పూరి గజపతి మహా రాజా దివ్యసింగ్ దేవ్‌కు రత్న భాండాగారం పరిరక్షణ మరియు సొత్తు జాబితా తయారీ ఉభయ కార్యకలాపాలపట్ల రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను స్వాగతించారు. 45 ఏళ్లుగా రత్న భాండాగారం లోపలి గది మూతపడి ఉంది. దీన్ని తెరవడం చాలా కాలంగా ఊగిసలాడుతుంది. ఇటీవల కాలంలో ఊగిసలాట ప్రజా ఉద్యమంగా వేడెక్కి పలు సందర్భాల్లో కలకలం రేపింది.

'రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలి'


నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న విశ్వ హిందూ పరిషత్ శ్రేణులు

జయపురం: పార్లమెంట్‌లో ప్రతిపక్ష కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ హిందూ మతాన్ని కించపరుస్తూ మాట్లాడడం సరికాదని విశ్వహిందూ పరిషత్ జయపురం శాఖ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు వీహెచ్‌పీ శ్రేణులు జయపురం రఘునాథ్ మందిర కూడలి నుంచి ర్యాలీ నిర్వహిస్తూ రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. స్థానిక బస్టాండ్ కూడలి వద్ద రాహుల్ గాంధీ దిష్టి బొమ్మను దగ్ధం చేశారు.

కార్యక్రమంలో గోసేవ సంస్థ నేత రజనీకాంత నాయిక్, నిరంజన్ పాణిగ్రాహి, రాజకిశోర్ దాస్, లుణా పాఢీ, లలిత్ అగర్వాల్, డొంబురు పాణిగ్రాహి, సుబ్రత్ కుమార్ పండ, సంతోష్ సాహు తదితరులు పాల్గొన్నారు. అలాగే జయపురం బీజేపీ యువమోర్చ నాయకులు రాహుల్ గాంధీ చేసిన వాఖ్యలు దేశంలోని హిందువులను అవమానించడమేనని మండిపడ్డారు. ఈ మేరకు స్థానిక రాజనగర్ కూడలిలో రాహుల్ గాంధీ ఫొటోలను తగలబెట్టారు. హిందువులు ఎన్నడూ హింసను ప్రోత్సహించరని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎ.దుర్గా ప్రసాద్, సుదాంసు శేఖర జెన, జిల్లా బీజేపీ మహిళా మోర్చ అధ్యక్షురాలు స్మిత హత్త, అమర్‌లాల్ అహుజ, శ్యామ సుందర బెహర, గౌర దాస్, వరుణ జైన్, రజనీ నాయిక్, రవీంద్ర ప్రధాన్, పి.నవీన, శుచిస్మిత బెహర, చిన్మయ సాహు తదితరులు పాల్గొన్నారు.


రాహుల్ గాంధీ చిత్రపటాన్ని తగలబెడుతున్న దృశ్యం

కొత్త కలెక్టర్ బాధ్యతల స్వీకరణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా నూతన కలెక్టర్‌గా స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం మధ్యాహ్నం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఉన్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌కి బదిలీ అయింది. ఆయన స్థానంలో స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే. ఆయన కుటుంబ సమేతంగా రాగా.. అరసవల్లి దేవస్థానం వేదపండితులు వేద మంత్రాలతో స్వాగతం పలికారు. అనంతరం బాధ్యతలు స్వీకరిస్తూ సంతకం చేశారు. కలెక్టర్‌ను జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, డీఆర్‌ఓ ఎం.గణపతిరావు, కలెక్టరేట్ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు.

ఆదిత్యుడిని దర్శించుకున్న కలెక్టర్

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని జిల్లా నూతన కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సతీసమేతంగా గురువారం సాయంత్రం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛరణల నడుమ గౌరవ సంప్రదాయ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. కలెక్టర్ గోత్రనామాలతో అర్చకులు పూజలు జరిపించారు. అనంతరం వేదాశీర్వచనాన్ని, తీర్థప్రసాదాలను అందజేశారు. తర్వాత ఆలయ విశిష్టతను కలెక్టర్‌కు శంకరశర్మ వివరించారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ


రాయగడ: మొక్కలు నాటుతున్న రిజిస్ట్రార్ జగన్నాథరావు తదితరులు

రాయగడ: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని వక్తలు పేర్కొన్నారు. జిల్లాలోని గుణుపూర్‌లో ఉన్న గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (జీఐఈటీ) విశ్వ విద్యాలయంలో వన మహోత్సవాన్ని గురువారం నిర్వహించారు. దీనిలో భాగంగా గుణుపూర్ అటవీ శాఖ రేంజర్ గంగాధర్ మిశ్రో, ఫారెస్టర్ శివానీ పాత్రో, సస్మిత పాత్రో, స్వప్నబౌరి, వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఏవీ జగన్నాథరావు, కులపతి ఏవీఎస్ శర్మ, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు.

పర్యావరణంపై అవగాహన అవసరం

పర్యావరణంపై ప్రతీ విద్యార్థికి అవగాహన అవసరమని కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్ అన్నారు. స్థానిక అటానమస్ కళాశాల 58వ వ్యవస్థాపక దినోత్సవాన్ని కళాశాల ప్రాంగణంలో గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ముందుగా కళాశాల ప్రాంగణంలో జరిగిన మొక్కల నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. అదనపు కలెక్టర్ భాస్కరరైతా మాట్లాడుతూ.. క్రమశిక్షణతో విద్యనభ్యసిస్తే భవిష్యత్ బాగుంటుందని విద్యార్థులకు సూచించారు. సబ్ కలెక్టర్ కల్యాణి సంఘమిత్రా దేవి మాట్లాడుతూ.. పట్టుదల, శ్రమ ఉంటే సాధించలేనిదంటూ ఏమీ ఉండదన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ బాబిలత షరఫ్ వార్షిక నివేదికను చదివి వినిపించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.


రాయగడ: మొక్కలు నాటుతున్న విద్యార్థినులు


రాయగడ: మొక్కలు నాటుతున్న కలెక్టర్ మహాజన్ తదితరులు

ఆదిత్యా మాడీ పార్థివదేహానికి నివాళులు


నివాళులర్పిస్తున్న కలెక్టర్ సచిన్ పవార్

మల్కన్‌గిరి: మాజీ ఎమ్మెల్యే ఆదిత్యా మాడీ బుధవారం కన్నుమూసిన విషయం విధితమే. దీంతో ఆయన పార్థివదేహాన్ని గురువారం భువనేశ్వర్ నుంచి మల్కన్‌గిరికి తీసుకొచ్చి కార్యకర్తల సందర్శనార్థం బీజేపీ కార్యాలయంలో ఉంచారు.

ఈ సందర్భంగా అక్కడ ఆయన మృతదేహానికి కలెక్టర్ సచిన్ పవార్, ప్రస్తుత మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సింగ్ మడ్కమి, చిత్రకొండ ఎమ్మెల్యే మాంగుఖీలో, మల్కన్‌గిరి మాజీ ఎమ్మెల్యే ముకుందో సోడి, చిత్రకొండ మాజీ ఎమ్మెల్యేలు పూర్ణచంద్ర బక్క, డొంబురు సీసా తదితరులు నివాళులర్పించారు. అనంతరం ఆయన స్వగ్రామానికి తరలించారు.


ఆదిత్య మాడి స్వగృహం వద్దకు చేరిన ప్రజలు

రావులవలస వాసికి ఏడాది జైలు శిక్ష

నరసన్నపేట: మండలంలోని రావులవలసకు చెందిన తాళ్ల రాంబాబుకు ఏడాది జైలు శిక్షను విధిస్తూ స్థానిక సివిల్ జడ్జి సి.హరిప్రియ బుధవారం తీర్పునిచ్చారు. 2019 జూన్ 4న నరసన్నపేట మండలం గుండవల్లిపేటకు చెందిన తాళ్ల కుమారి తన భర్త రాంబాబు అత్తమామలు రాములమ్మ, పెంటయ్య, ఆడపడుచు లక్ష్మీ సౌందర్యలపై ఫిర్యాదు చేశారు. కేసును విచారించిన జడ్జి గురువారం ఈ మేరకు తీర్పు చెప్పారు. రాంబాబు మినహా మిగిలిన ఆయన కుటుంబ సభ్యులు నిర్దోషులుగా గుర్తించి వారికి ఎలాంటి శిక్ష విధించలేదు. అప్పట్లో నరసన్నపేట ఎస్ఐగా ఉన్న ఎస్ఐ మహమ్మద్ అలీ కేసు నమోదు చేశారు. కోర్టులో ఏపీపీగా శాంతి సంతోషి వ్యవహరించారు.

జిల్లాలో ఏడు డీసీసీబీ బ్రాంచీలు ఏర్పాటు

ఇచ్ఛాపురం రూరల్: జిల్లాలోని ప్రతి మండలంలో ఒక డీసీసీబీ బ్యాంకు ఉండాలన్న ఉద్దేశంతో ఈ ఆర్థిక సంవత్సరం నాటికి అదనంగా మరో ఏడు బ్రాంచీలను ప్రారంభిస్తున్నామని డీసీసీబీ జీఎం ఎస్‌వీఎస్ జగదీష్ అన్నారు. ఆయన గురువారం స్థానిక వ్యవసాయ సహకార పరపతి సంఘం, డీసీసీబీ బ్యాంకుల్లో కంప్యూటరైజేషన్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కంచిలి, నందిగాం, సంతబొమ్మాళి, పోలాకి, చిలకపాలెం, పూండి, కొల్లివలస గ్రామాల్లో బ్రాంచీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ రుణాలు రెన్యువల్ చేస్తున్నామని, ఖరీఫ్, రబీ సీజన్‌లలో వంద కోట్లు బిజినెస్‌కు టార్గెట్ చేయడం జరిగిందని, ప్రస్తుతం రూ.50కోట్లకు దగ్గరలో ఉన్నామన్నారు. జిల్లాలో 49 పీఏసీఎస్‌ల్లో కంప్యూటరైజేషన్ 50 శాతం పూర్తయ్యిందని, త్వరలో మిగతా 50 శాతం పూర్తి చేయనున్న నేపథ్యంలో ఇక నుంచి ఆన్‌లైన్‌లోనే లావాదేవీలు చేయడం జరుగుతుందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో స్వయం సహాయక సంఘాలకు వంద కోట్లు వరకు రుణాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. చిరు వ్యాపారుల ఆర్థికాభివృద్ధికి తమ బ్యాంకుల ద్వారా సుమారు రూ.50వేల వరకు రుణాలు అందజేస్తున్నామని తెలిపారు. అర్బన్ ఏరియాలో నిబంధనలకు లోబడి రూ.75లక్షల వరకు ఇళ్ల నిర్మాణాలపై రుణాలు అందిస్తున్నామని అన్నారు. సమీక్ష సమావేశంలో డీసీసీబీ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ డొంకాన కృష్ణారావు, పీఏసీఎస్ సీఈఓ భుజంగరావు, అసిస్టెంట్ మేనేజర్ మోహన్ పురియాలతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

అరసవల్లిలో ఘనంగా మహాలింగార్చన


మహాలింగార్చన నిర్వహిస్తున్న అర్చకులు సందీప్‌శర్మ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో మాసశివరాత్రి సందర్భంగా గురువారం ఉదయం అనివెట్టి మండపంలో మహాలింగార్చన కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో మహాపర్వం శివ పంచాయతన సహిత మహాలింగార్చనను అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మ నిర్వహించారు. భక్తులు ఈ లింగార్చనలో పాల్గొని అనంతరం ఆదిత్యుడిని దర్శించుకున్నారు.

పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం


లబ్బ గిరిజన ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల సందర్శనలో భాగంగా హెచ్‌ఎంకు ఆదేశాలు ఇస్తున్న డీడీ అన్నదొర

కొత్తూరు: విద్యార్థుల ఆరోగ్యంపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డీడీ అన్నదొర ఆదేశించారు. కొత్తూరు మండలం లబ్బ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. వంట గదులు, వాటర్ ప్లాంట్, తరగతి గదులను పరిశీలించారు. వాటర్ ప్లాంట్ ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని చెప్పారు. విద్యార్థులకు వైద్యాధికారులతో ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించాలన్నారు. నాణ్యమైన, రుచికరమైన భోజనం పెట్టాలని చెప్పారు. విద్యార్థులు గైర్హాజరు కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయనతో పాటు ఐటీడీఏ డిప్యూటీ డీఈఓ నారాయుడు, ఏఎంఓ పాట్నూరు కోటిబాబు, సీఎంఓ చిరంజీవులు, జీసీడీవో రాములమ్మ ఉన్నారు.

ఫ్రింజ్ పరిశ్రమలో స్వల్ప ప్రమాదం

రణస్థలం: మండలంలోని పిసిని పంచాయతీలో గల ఫ్రింజ్ ల్యాబొరేటరీ రసాయనిక పరిశ్రమలో స్వల్ప ప్రమాదం చోటు చేసుకుందని జేఆర్ పురం పోలీసులు తెలిపారు. పరిశ్రమలో కొంతమంది కార్మికులు పనిచేస్తుండగా గురువారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో త్రీని క్లోరైడ్ రసాయనిక డ్రమ్ ఒత్తిడికి గురై డ్రమ్ మూత తెరుచుకుంది. రసాయన వాయువులు బయటకు రావడంతో ఆ సమయంలో అక్కడ పని చేస్తున్న పాట్నూరు త్రినాథరావు, కొలగాన గోవిందరావు కళ్లు ఎర్రగా మారాయి. త్రినాథరావు కళ్లకు పైడిభీమవరంలో ప్రథమ చికిత్స చేసి ఇంటికి పంపించారు. గోవిందరావుకు తీవ్రత ఎక్కువగా ఉండటం వల్ల విజయనగరంలోని ప్రముఖ కంటి వైద్యులకు చూపించి చికిత్స అందించారు. ఇరువురి పరిస్థితి ప్రస్తుతం బాగానే ఉంది. దీనిపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని జేఆర్ పురం ఎస్ఐ కె.గోవిందరావు తెలిపారు. ప్రమాద స్థలాన్ని ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు, జేఆర్ పురం సీఐ జి.రామచంద్ర రావు పరిశీలించారు.

ఆదిత్యుని సన్నిధిలో సినీ నటుడు సంపూర్ణేష్‌బాబు


ఆదిత్యుని సన్నిధిలో సంపూర్ణేష్ బాబు

అరసవల్లి: త్వరలో విడుదల కానున్న 'సోదరా..' సినిమాలో కొత్త సంపూర్ణేష్‌బాబును చూస్తారని, ఇప్పటివరకు చేసిన పాత్రల కంటే విభిన్నమైన పాత్ర పోషిస్తున్నట్లుగా ప్రముఖ నటుడు సంపూర్ణేష్ బాబు అన్నారు. ఆయన గురువారం అరసవల్లి సూర్యనారాయణ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఇప్పిలి షణ్ముఖశర్మ, సిబ్బంది బీఎస్ చక్రవర్తిలు ఆయనకు గౌరవంగా స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం సంపూర్ణేష్‌బాబు విలేకరులతో మాట్లాడుతూ తన కొత్త సినిమాను గార మండలం లంకపేట శివాలయం వద్ద ప్రారంభించిన సందర్భంగా జిల్లాకు వచ్చామని, జిల్లాలో పలు ప్రాంతాల్లో షూటింగ్‌ను చేయనున్నట్లుగా వివరించారు. అలాగే తమిళంలో ఒక సినిమా చేస్తున్నానని, సరికొత్త పాత్రలతో ప్రేక్షకుల ముందుకు వస్తానని ప్రకటించారు. అనంతరం స్వర్ణకారుల సంఘ ప్రతినిధులు ఎం.విజయ్, ఫైట్ మాస్టర్ జానీ తదితరులు హీరో సంపూర్ణేష్‌బాబును ఘనంగా సత్కరించారు.

రాజీనామా తిరస్కరణ

ఎచ్చెర్ల క్యాంపస్: రాజకీయ ఒత్తిళ్ల కారణంగా పూడివలస గ్రామ సచివాలయ కార్యదర్శి సనపల సీతారాం బుధవారం రాజీనామా చేసిన విషయం విధితమే. ఎంపీడీఓ, డీపీఓలకు రాజీనామా లేఖ అందజేయగా వారు తిరస్కరించారు. ఫార్మేట్ సక్రమంగా లేక పోవటం, కేవలం వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు లేఖలో ప్రస్తావించడం వల్ల తిరస్కరించినట్లు సమాచారం.

నిరాశలో 'ఆణిముత్యాలు'

- గతేడాది టాపర్లకు రాష్ట్రస్థాయిలో రూ.లక్ష బహుమతి
- జిల్లా, నియోజకవర్గ స్థాయి విజేతలకు ప్రోత్సాహకాలు
- ఈ ఏడాది ఇంతవరకూ విడుదల కాని మార్గదర్శకాలు
- అయోమయంలో విద్యార్థులు, తల్లిదండ్రులు



రామభద్రపురం ఉన్నత పాఠశాలలో పట్టుదలతో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు (ఫైల్)



పదోతరగతి పబ్లిక్ పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యారుథలు(ఫైల్)

రామభద్రపురం: ప్రభుత్వ విద్యారంగాన్ని పటిష్టం చేయడం..ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభావంతులైన విద్యార్థులను గత ప్రభుత్వం ప్రోత్సహించింది. విద్యార్థుల్లో స్ఫూర్తి నింపేందుకు 2022–23 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఎంపిక చేసి 'ఆణిముత్యాలు' పేరిట నగదు ప్రోత్సాహకాలు అందించింది. పదో విద్యార్థులకు మాత్రమే కాకుండా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రతి గ్రూప్‌లో టాపర్లను ఎంపిక చేసి నియోజకవర్గం, జిల్లా, రాష్ట్రస్థాయిలో నగదు ప్రోత్సాహకాలు అందించింది. 'ఆణిముత్యాలు'గా ఎంపికైన విద్యార్థులు చదువుతున్న పాఠశాలల్లో ఉపాధ్యాయుల్ని, నగదు పురస్కారం అందుకున్న విద్యార్థుల తల్లిండ్రులను కూడా గత ప్రభుత్వం ఘనంగా సత్కరించి గౌరవించింది. అయితే ఈ పథకాన్ని ఏటా అమలు చేయనున్నట్లు అప్పట్లో స్పష్టం చేసింది. దీంతో 2023–24 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించిన వారు 21,752 మంది ఉన్నారు. వారిలో టాపర్లకు నగదు ప్రోత్సాహకాలు అందుతాయని అంతా భావించారు. అయితే ఈ ఏడాది ఇంత వరకూ 'ఆణిముత్యాలు' పథకం అమలుపై నూతన ప్రభుత్వం ఏ విధమైన మార్గదర్శకాలు జారీ చేయకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు నిరాశతో ఉన్నారు.

టాపర్లకు రూ.లక్ష బహుమతి

ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి, ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియట్‌లో వివిధ గ్రూపులు చదివిన విద్యార్థుల్లో ప్రథమ స్థానంలో నిలిచిన రాష్ట్రస్థాయి టాపర్లకు రూ.లక్ష నగదు ప్రోత్సాహకాన్ని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్వయంగా అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.75 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ.50 వేలు చొప్పున అందజేశారు.నగదు పురస్కారంతో పాటు సర్టిఫికెట్, మెడల్స్ కూడా ఇచ్చి విద్యార్థులను ప్రోత్సహించారు.

జిల్లా, నియోజకవర్గాల స్థాయిలో కూడా..

నగదు ప్రోత్సాహకాలు కేవలం రాష్ట్రస్థాయికే పరిమితం చేయకుండా నియోజకవర్గం, జిల్లా స్థాయికి వర్తింపజేశారు. జిల్లా స్థాయిలో టాపర్లకు రూ.50 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.30 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ.15 వేలు చొప్పున అందించారు. అలాగే నియోజకవర్గం స్థాయి టాపర్లకు రూ.15 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.10 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ.5 వేలు చొప్పున అందజేశారు. ఈ రెండు స్థాయిల్లో కూడా ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించారు. స్థానిక దాతల సహకారంతో పాఠశాల స్థాయి టాపర్లకు ప్రథమ స్థానానికి రూ.3 వేలు, ద్వితీయ స్థానానికి రూ.2 వేలు, తృతీయ స్థానానికి రూ.1000 చొప్పున నగదు బహుమతులను అందజేశారు. అయితే విజయనగరం జిల్లాలో జిల్లా, నియోజకవర్గం స్థాయిలో ప్రథమ స్థానంలో 16 మంది, ద్వితీయ స్థానంలో 24 మంది, తృతీయ స్థానంలో 25 మంది, మొత్తం 65 మంది విద్యార్థులకు నగదు పురస్కారం అందగా ఇంటర్మీడియట్‌లో 248 మంది విద్యార్థులకు వివిధ స్థాయిల్లో నగదు బహుమతులు అందాయి.

ఈ ఏడాది సందిగ్ధం..

'ఆణిముత్యాలు' పథకానికి గత ఏడాది తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల నుంచి గొప్ప స్పందన లభించింది. గతంలో ఏ ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమం చేపట్టలేదని, భవిష్యత్‌లో కూడా కొనసాగించాలని కోరారు. గత ఏడాది జూన్ 20 నాటికి అన్ని స్థాయిల్లో నగదు ప్రోత్సాహకాలు అందించే కార్యక్రమాలు పూర్తయ్యాయి. అయితే ఈ ఈ ఏడాది 'ఆణిముత్యాలు' పథకం అమలవుతుందా? లేదా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. దీనిపై జిల్లా విద్యాశాఖాధికారులకు కూడా మార్గదర్శకాలు అందకపోవడంతో ఈ ఏడాది నగదు ప్రోత్సాహకాలు ఇస్తారా? లేదా? అనే సందేహం సర్వత్రా వ్యక్తమవుతోంది.ఈ పథకం అమలు కాకుంటే దాని ప్రభావం తమ భవిష్యత్ చదువులపై పడవచ్చని, పథకాన్ని కొత్త ప్రభుత్వం కొనసాగించాలని విద్యార్థులు కోరుతున్నారు.

వెలువడని మార్గదర్శకాలు



రాష్ట్ర విద్యాశాఖ ఇప్పటివరకూ ఏ విధమైన మార్గదర్శకాలు విడుదల చేయలేదు. 'ఆణిముత్యాలు' పథకం మంచిదే. ఈ పథకం అమలు ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభావంతుల్ని మరింత ప్రోత్సహించొచ్చు. సర్కారు నుంచి ప్రకటన వెలువడిన వెంటనే టాపర్ల ఎంపిక చేపడతాం.

ఎస్.ప్రేమ్‌కుమార్, డీఈవో, విజయనగరం

క్లుప్తంగా

జీఎంఆర్ ఐటీ వేదికగా అంతర్జాతీయ సదస్సు

- నేటి నుంచి రెండు రోజుల పాటు నిర్వహణ

రాజాం సిటీ: రెండు రోజుల పాటు జరగనున్న అంతర్జాతీయ సదస్సుకు రాజాం పట్టణంలోని జీఎంఆర్ ఐటీ కళాశాల వేదిక కానుంది. ఈ నెల 5న 'ఏఐ-పవర్డ్ టెక్నాలజీ ఇంటిగ్రేషన్ ఫర్ సస్టైనబిలిటీ' (ఏఐ-పీటీఐఎస్-2024)ని కళాశాలలో ప్రారంభించనున్నారని ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్‌ఎస్‌వీ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హైబ్రీడ్ (ఆన్‌లైన్, ఆఫ్‌లైన్) విధానంలో రెండు రోజులపాటు నిర్వహించనున్న ఈ సదస్సులో స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో కృత్రిమ మేధస్సు (ఏఐ), మానవాళి మనుగడకు దోహదపడే అంశాలను చర్చించడానికి ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ఏఎస్‌టీఐఎఫ్ ప్రెసిడెంట్, ఛత్తీస్‌గఢ్‌లోని అమిటీ యూనివర్సిటీ చాన్సలర్ డాక్టర్ డబ్ల్యూ.సెల్వమూర్తి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని తెలిపారు. అలాగే ఆంధ్రాయూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ డాక్టర్ వి.వల్లికుమారి గౌరవ అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ అప్లికేషన్స్, రెన్యువబుల్ ఎనర్జీ, సైన్స్, ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ అనే అంశాలపై పరిశోధకులు చర్చిస్తారన్నారు. దేశ విదేశాల నుంచి వచ్చిన వారు 135 పరిశోధన పత్రాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కన్వీనర్లుగా డాక్టర్ కె.జయశ్రీ, డాక్టర్ కె.రవీంద్రనాథ్‌లు వ్యవహరించనున్నారని వివరించారు.

మహిళల మెడలో బంగారం చోరీ

జియ్యమ్మవలస: మండలంలోని పరజపాడు గ్రామానికి చెందిన బోను గంగ,నక్క పోలమ్మల మెడలోని బంగారం చోరీకి గురైనట్లు ఎస్సై చిన్నంనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై చిన్నంనాయుడు మాట్లాడుతూ గెడ్డతిరువాడలో సీమంతం కార్యక్రమానికి బుధవారం రాత్రి వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో వారిద్దరి మెడలో పుస్తెలతాళ్లు దుండుగుడు తెంపుకుని పోయాడని చెప్పారు. పిప్పలభద్ర, గెడ్డతిరువాడ గ్రామాల మధ్య పల్సర్‌బైక్‌పై గుర్తుతెలియని వ్యక్తి వచ్చి గంగమెడలో ఉన్న నల్లపూసలతాడు తెంపగా అందులో కొంత భాగం ఉండిపోయి ముప్పావు తులం వరకు పోయిందని, అలాగే పోలమ్మ మెడలో ఉన్న బంగారం తాడు సగభాగం తెంచి దుండగుడు పోయాడని తెలిపారు.వారిద్దరి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

విద్యార్థుల ప్రవేశాల సంఖ్య పెరగాలి



మాట్లాడుతున్న డీవీఈఓ భీమశంకరావు

విజయనగరం అర్బన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ కోర్సులలో ప్రవేశాలను పెంచి విద్యార్థుల నమోదు సంఖ్యను పెంచాలని జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి ఎస్.భీమశంకరరావు కోరారు. ఈ మేరకు జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో డీవీఈఓ కార్యాలయంలో గురువారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళాశాలల్లో ప్రస్తుతం ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం సమీప పరిసరాల్లో పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు తమకు నచ్చిన గ్రూప్‌లో చేరవచ్చని ఆదిశగా ప్రచారం చేయాలని సూచించారు. వార్షిక పరీక్షల్లో మంచి ఫలితాలను సాధించడానికి అధ్యాపకులతో సమన్వయంగా పనిచేయించాలని కోరారు. ఇంటర్మీడియట్ కోర్సుల సాధారణ సిలబస్‌లతో పాటు ఎంసెట్, నీట్ తరగతులను కూడా నిర్వహించాలని సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సమయపాలన పాటించని అధ్యాపకులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఆర్ఐఓ మజ్జి ఆదినారాయణ, జిల్లాలోని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

బాసంగి గదబవలసలో ఏనుగుల గుంపు



బాసంగి గదబవలస పంట పొలాల్లో ఏనుగుల గుంపు

జియ్యమ్మవలస: మండలంలోని బాసంగి గదబవలస పంట పొలాల్లో ఏనుగుల గుంపు గురువారం దర్శనమిచ్చాయి. అరటి, పామాయిల్ తోటలతో పాటు వరి నారుమడుల్లో సంచరిస్తుండడంతో రైతులు భయాందోళన చెందుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి వాటిని తరలించే చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

అగ్నివీర్‌కు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురంటౌన్: అగ్నివీర్ పథకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా ఉపాధి అధికారి వహిద గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇండియన్ ఎయిర్ ఫోర్సులో పనిచేసేందుకు ఎస్ఎస్‌సీ/ ఇంటర్మీడియట్ (మాథ్స్/ ఫిజిక్/ కెమిస్ట్రీ)లో 50శాతం మార్కులు కలిగిన యువతీ యువకులు ఈ నెల 8 నుంచి 28వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వెబ్ పోర్టల్ హెచ్‌టీటీపీఎస్://అగ్నిపథ్.సీడీఏసీ.ఇన్‌లో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

మినీ రేషన్ డిపో ఏర్పాటు చేయాలి

- గిరిజనుల డిమాండ్



మినీ రేషన్ డిపో కావాలని డిమాండ్ చేస్తున్న సర్పంచ్ శంకర రావు, గ్రామస్తులు

సాలూరు రూరల్: మండలంలోని కరడవలస గ్రామంలో మినీ రేషన్ డిపో ఏర్పాటు చేయాలని ఆ పంచాయతీ గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల గిరిజన శాఖామంత్రి గుమ్మడి సంధ్యారాణి ఏజెన్సీలో డిపోలద్వారా రేషన్ సరుకులు పంపిణీచేస్తామని ప్రకటించడంతో తాము డిపోలో సరుకులు తీసుకోడానికి దండిగాం వెళ్లాల్సి ఉంటుందని అలా కాకుండా కరడవలసలో మినీ రేషన్ డిపో ఏర్పాటు చేస్తే సుమారు 15 గ్రామాల గిరిజనులకు సరుకులు తీసుకునేందుకు దగ్గరగా ఉంటుందన్నారు. గతంలో కరడవలస గ్రామానికి రోడ్డు సదుపాయం ఉండేది కాదని వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్న దొర చొరవతో కరడవలసకు బీటీరోడ్డు నిర్మాణం జరిగిందని చెప్పారు. ఇప్పుడు గ్రామానికి వాహనాల రాకపోకలు నిరంతరం జరుగుతున్నాయని, మినీ రేషన్ డిపో మంజూరు చేయకపోతే ఇప్పటివరకు సరుకులు పంపిణీ చేసిన విధానంలోనే తమ గ్రామానికి మొబైల్ రేషన్ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

381 మద్యం సీసాలు ధ్వంసం



మద్యం సీసాలను ధ్వంసం చేస్తున్న ఎస్సై భాస్కరరావు, సిబ్బంది

గుర్ల: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నమోదైన 24 కేసుల్లో పట్టుబడిన 381 మద్యం సీసాలు, 20లీటర్ల సారాను గురువారం ధ్వంసం చేసినట్లు ఎస్సై భాస్కరరావు తెలిపారు. ఎస్పీ ఆదేశానుసారం ఎస్ఈబీ అధికారుల సమక్షంలో మద్యం సీసాలు ధ్వంసం చేశామని చెప్పారు. గ్రామాల్లో బెల్ట్ షాపు ద్వారా మద్యం అమ్మకాలు జరిపితే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఏఎన్ఓ, ఏపీఓ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం



డీఈఓ పగడాలమ్మ

పార్వతీపురంటౌన్: డీఈఓ కార్యాలయంలో ఖాళీగా ఉన్న ఏఎస్ఓ, ఏపీఓ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ పగడాలమ్మ కోరారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఏఎస్ఓ-1, ఏపీఓ-2 మొత్తం మూడు పోస్టులకు ఈ నెల 5న సాయంత్రం లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పార్వతీపురం మ్యం జిల్లాలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు మాత్రమే ఈ పోస్టులకు అర్హులని స్పష్టం చేశారు. అభ్యర్థులను కలెక్టరేట్‌లో కంప్యూటర్ టెస్ట్ ద్వారా ఎంపిక చేస్తారని తెలిపారు.

నూతన కలెక్టర్‌కు అభినందనలు



కలెక్టర్‌కు అభినందనలు తెలుపుతున్న ఫోరం ఫర్ బెటర్ విజయనగరం ప్రతినిధులు

విజయనగరం టౌన్: ఫోరం ఫర్ బెటర్ విజయనగరం తరఫున పట్టణంలో ఉన్న వివిధ స్వచ్ఛంద సంస్థల అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు నూతన కలెక్టర్ డాక్టర్ బీఆర్.అంబేద్కర్‌ను గురువారం ఆయన చాంబర్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ వెంకటేశ్వరరావు, కాపుగంటి ప్రకాశ్‌లు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. వివిధ సంస్థల ప్రతినిధులు ఫోరం తరఫున కలెక్టర్‌ను దుశ్శాలువాలతో సత్కరించారు. పట్టణ అభివృద్ధికి ఫోరం సభ్యుల సహకారం ఎప్పుడూ ఉంటుందని ఫోరం అధ్యక్షుడు డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు ఈ సందర్భంగా కలెక్టర్‌కు వివరించారు. త్వరలోనే ఫోరం సభ్యులతో సమావేశం నిర్వహించి తగు సూచనలు, సలహాలు స్వీకరిస్తామని కలెక్టర్ వారికి తెలిపారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు డాక్టర్ పద్మకుమారి, నాగేశ్వరరావు, శంకర్‌రెడ్డి, రవ్వాశ్రీనివాస్, లిఫ్టింగ్ హ్యాండ్స్ ప్రతినిధి ఎస్.అచ్చిరెడ్డి, జీహెచ్‌వీ ప్రతినిధి, ఫోరం కోశాధికారి భోగరాజు సూర్యలక్ష్మి, కాపుగంటి రవి, ఇన్నర్‌వీల్ రాధిక, ఇందు తదితరులు పాల్గొన్నారు.

బావిలో దూకిన మహిళ సుక్షితం

- రక్షించిన పోలీసులు



బావిలో దూకిన మహిళను కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

వీరఘట్టం: మండలంలోని చలివేంద్రి గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని మహిళ లావణ్య(35) బుధవారం అర్ధరాత్రి బావిలో దూకడంతో ఆమెను పోలీసులు చాకచక్యంగా రక్షించారు. ఈ మేరకు ఎస్సై కళాధర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొనేళ్లగా మానసిక పరిస్థితి బాగోలేక అవస్థలు పడుతున్న లావణ్యను కుటుంబసభ్యులు కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. అయితే బుధవారం రాత్రి వారింటి సమీపంలో ఉన్న బావిలో లావణ్య దూకింది. ఈ విషయం తెలిసిన వెంటనే ఎస్సై కళాధర్‌తో పాటు పాలకొండ అగ్నిమాపక కేంద్రం ఇన్‌స్పెక్టర్ సోమేశ్వరరావు తమ సిబ్బందితో వచ్చి పరిస్థితిని పరిశీలించారు. బావిలోకి నిచ్చెన ద్వారా అగ్నిమాపక సిబ్బంది దిగి మహిళను బయటకు సురక్షితంగా తీసుకువచ్చి కుటుంబసభ్యులకు అప్పగించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

విజయనగరం విక్టరీ

- క్రికెట్ టోర్నీలో ప్రకాశం జట్టుపై 138 పరుగులతో గెలుపు



విజయం సాధించిన విజయనగరం జిల్లా జట్టు

విజయనగరం: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయనగరం జిల్లా కేంద్రంలోని విజ్జీ క్రికెట్ మైదానంలో ఈనెల 2 నుంచి నిర్వహిస్తున్న అంతర్ జిల్లాల అండర్-16 క్రికెట్ టోర్నీలో విజయనగరం జిల్లా జట్టు ప్రకాశం జిల్లా జట్టుపై 138 పరుగుల తేడాతో విజయం సాధించి బోణీ కొట్టింది. టెస్ట్ మ్యాచ్ తరహాలో మూడు రోజుల ఫార్మాట్‌లో జరుగుతున్న టోర్నీలో తొలి ఇన్నింగ్స్‌లో విజయనగరం జట్టు 255 పరుగులు సాధించగా ప్రకాశం జిల్లా జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 161 పరుగులకు ఆలౌట్ అయ్యి 94 పరుగులు వెనుకబడింది. రెండో ఇన్నింగ్స్‌లో విజయనగరం జట్టు 210 పరుగులకు ఆలౌట్ కాగా, ప్రకాశం జట్టు మూడో రోజు గురువారం 166 అడుగులకు ఆలౌట్ అయి 138 పరుగుల తేడాలతో ఓటమి పాలైంది. విజయనగరం జట్టులో తొలి ఇన్నింగ్స్‌లో చరణ్ తేజ 50 పరుగులు, మస్ వటేకర్ 72 పరుగులు సాధించగా, రెండో ఇన్నింగ్స్‌లో జి.ఫణీంద్ర 50 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ప్రకాశం జట్టులో ఎస్ఎస్ అభినవ్ తొలి ఇనింగ్స్‌లో 50 పరుగులు చేయగా రెండో ఇన్నింగ్స్‌లో వైభవ్ రెడ్డి 54 పరుగులు సాధించినప్పటికీ జట్టును ఓటమి నుంచి కాపాడలేకపోయారు. విజయం సాధించిన విజయనగరం జిల్లా జట్టును, కోచ్ బహదూర్‌ను జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ ఎన్ రాజు, ట్రెజరర్ పి.సీతారామరాజు, సెలెక్టర్లు వర్మ, సర్ఫరాజ్, బంగార్రాజులు అభినందించారు

ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించాలి



మాట్లాడుతున్న ఆపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ సత్యనారాయణ

- ఆపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీసత్యనారాయణ

విజయనగరం అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నత ప్రభుత్వ పాఠశాలల మనుగడను ప్రశ్నార్థకంగా మార్చిన జీఓ నంబర్ 117ను రద్దు చేసి 3, 4, 5 తరగతుల విద్యార్థులను వారి అభ్యసన స్థాయికి అనుగుణంగా ప్రాథమిక పాఠశాలల్లోనే కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన స్థానిక సేవాభారతి కార్యాలయంలో జరిగిన జిల్లా కోర్ కమిటీ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాథమిక, ఉన్నత స్థాయిలలో సిలబస్‌ను సమీక్షించి, విద్యార్థుల స్థాయికి మించిన పాఠ్యాంశాలను తొలగించి విద్యార్థులపై సిలబస్ భారాన్ని, ఒత్తిడిని తగ్గించాలని పేర్కొన్నారు. ప్రతి పాఠశాలలో ఆంగ్ల మాధ్యమంతో పాటు తెలుగు మాధ్యమాన్ని కూడా సమాంతరంగా కొనసాగించాలన్నారు. తల్లికి వందనం ప్రోత్సాహకాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మాత్రమే అమలు చేయాలని కోరారు. ఉపాధ్యాయులకు గరిష్ఠంగా 30 పీరియడ్లకు మించి కేటాయించడం సమంజసం కాదని, దానికి అనుగుణంగా ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, వీవీజే సుబ్రహ్మణ్యం, రాష్ట్ర కార్యదర్శి ఈ.రామునాయుడు, రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఎస్.రమణ, కోశాధికారి ఏజీ తాతారావు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు మారోతు రమణ, ఆర్అప్పలనాయుడు, సంతోషలక్ష్మి, పద్మలత, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో నిందితులు



పోలీసులు అదుపులో నిందితులు, ఆభరణాలు

నెల్లిమర్ల: ఇటీవల నెల్లిమర్లలో జరిగిన దొంగతనం కేసులో నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ వెంకటేశ్వరరావు దొంగ తనానికి సంబంధించిన వివరాలను గురువారం వెల్లండిచారు. నెల్లిమర్ల జూట్‌మిల్లు కార్మికుడు రంజిత్ అక్కడే ఉన్న క్వార్టర్స్‌లో 30 ఏళ్లుగా నివాసిస్తున్నాడు. అతని ఇంటిలో ఇటీవల దొంగతనం జరిగింది. సుమారు రెండున్నర తులాలు బంగారం, 16 తులాలు వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయి. రంజిత్ నెల్లిమర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు 24 గంటల్లో కేసును చేధించి నగర పంచాయతీకి చెందిన ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఆభరణాలను రికవరీ చేశారు. వాటిని త్వరలోనే బాధితునికి అప్పగిస్తామని సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ డి.రామగణేష్, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల తొలగింపునకు ఆదేశం



సర్వేనంబర్ 142-1లోని భూముల్లో ఆక్రమణలను పరిశీలిస్తున్న ఆర్డీఓ సూర్యకళ

కొత్తవలస: విజయనగరం-కొత్తవలస రోడ్డును ఆనుకొని సర్వే నంబర్ 142-1లో ఉన్న గెడ్డపోరంబోకు భూముల్లో అక్రమ కట్టడాలను తొలగించాలని రెవెన్యూ అధికారులను విజయనగరం ఆర్డీఓ సూర్యకళ ఆదేశించారు. ఈ మేరకు సంబంధిత భూములను ఆమె గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎవరు ఎంత భూమి ఆక్రమించారన్న విషయాన్ని డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐలను అడిగి తెలుసుకున్నారు. ఈ భూముల్లో సుమారు 24 మంది ఆక్రమణదారులు ఉన్నట్లు గుర్తించామని, ఇప్పటికే సంబంధిత వ్యక్తులకు ఫారం-6,7 నోటీసులు జారీచేసినట్లు అధికారులు తెలిపారు. ఆక్రమిత భూముల్లో కొందరు ప్రభుత్వ ఉద్యోగులు సైతం ఇల్లు కట్టారని తెలపగా ఆర్డీఓ మండిపడ్డారు. భూ ఆక్రమణకు పాల్పడిన ఉద్యోగులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. అనంతరం చింతలదిమ్మ దగ్గర గల ఎంఎల్ఓ గొడౌన్‌ను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ టి.రమేష్, సర్వేయర్ గంగాధర్, ఆర్ఐ రాజేష్, వీఆర్వో రామానందం పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల సీజ్



ఇసుక ట్రాక్టర్‌లను సీజ్ చేస్తున్న ఎస్సై యు.మహేష్

గజపతినగరం: మండలంలోని లోగీశ, సీతారామపురం గ్రామ సమీపంలో అక్రమంగా ఇసుకను తరలిస్తూ పట్టుబడిన మూడు ట్రాక్టర్‌లను సీజ్ చేశామని ఎస్సై యు.మహేష్ తెలిపారు. ఈ మేరకు గురువారం రాత్రి ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ట్రాక్టర్‌లను సీజ్ చేస్తూ విలేకరులతో మాట్లాడారు.అక్రమ ఇసుక వ్యాపారాలు సాగిస్తున్న వారిపై ప్రత్యేక నిఘా పెట్టామని, తప్పు చేసిన ఎంతటి వారినైనా వదిలి పెట్టేది లేదని స్పష్టం చేశారు.

విద్యుత్‌షాక్‌తో పారిశుద్ధ్య కార్మికుడి మృతి



బంగారుబాబు మృతదేహం

డెంకాడ: మండలంలోని సింగవరం పంచాయతీ పరిధి లెంకపేట సమీపంలోని మోటార్ బోరు వద్ద పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్న దత్తి బంగారుబాబు విద్యుత్ షాక్‌కు గురై మరణించాడు. పోలీసులు, మృతుడి బంధువులు తెలిపిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. గురువారం ఉదయం 6 గంటల ప్రాంతంలో సింగవరం పంచాయతీలోని (జువ్వపాడు) ప్రభుత్వ పాఠశాల పక్కన ఉన్న తాగునీటి మోటార్ బోరు వద్ద కొడవలితో గడ్డి కోస్తుండగా కొడవలికి బోరు విద్యుత్ వైర్లు తగలడంతో బంగారుబాబు షాక్‌కు గురై అక్కడికక్కడే మరణించాడు. ఈ ఘటనపై మృతుని భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్సై ఎం.కృష్ణమూర్తి కేస నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. 2018 నుంచి సింగవరం పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుడిగా దత్తి బంగారుబాబు విధులు నిర్వర్తిస్తున్నాడు. ఎప్పటిలాగే ఇంటి నుంచి వెళ్లి బంగారుబాబు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో కుటుంబసభ్యులు భోరున విలపించారు.

ఒప్పంద అధ్యాపకుడు..

కొమరాడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒప్పంద అధ్యాపకుడిగా పని చేస్తున్న ఎం.సత్యనారాయణ గురువారం మృతి చెందినట్లు కళాశాల పిన్సిపాల్ వై.నాగేశ్వరరావు తెలిపారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం గత ఏడాది ఆగస్టు 8 తేదీన మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో తలకు బలమైన గాయం కావడంతో సత్యనారాయణ కోమాలోకి వెళ్లిపోయారు. అప్పటినుంచి వైద్యం అందించినప్పటికీ కోలుకోలేదు. ఆయన మృతి పట్ల కళాశాల సిబ్బంది సంతాపం వ్యక్తం చేసి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.